క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మకమలం



సర్వేశ్వరరావు ఇంటి పెరట్లో పూసిన బ్రహ్మకమలం పూలు

పార్వతీపురంటౌన్: మహాశివునికి బ్రహ్మకమలాలు అంటే ఎంతో ప్రీతికరం. ఈ పుష్పాలు హిమాలయాల్లో ఏడాదికి ఒక్కసారే విరబూస్తాయి. అలాంటి ఆ బ్రహ్మకమలాలు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో విరబూసి అందరినీ ఆకర్షిస్తున్నాయి. పట్టణంలోని వైకేఎం కాలనీకి చెందిన ఆశపు సర్వేశ్వరరావు ఇంటి ఆవరణలో నాటిన బ్రహ్మకమలం మొక్కకు పూలు విరబూశాయి. వాటిని సమీపంలోని శివాలయంలో సమర్పించారు.

రక్తదానంతో ఆరోగ్య ప్రయోజనాలు



మాట్లాడుతున్న రామకృష్ణ

పార్వతీపురంటౌన్: రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యుడు బోటు రామకృష్ణ అన్నారు. పార్వతీపురం పట్టణంలోని రైల్వే గేటు వద్ద ఉన్న సత్యనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

లీకవుతున్న వాటర్ ట్యాంక్

సాలూరు రూరల్: మండలంలోని సారిక గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ లీకవుతోంది. నిర్మాణ దశలో నాణ్యత లోపం కారణంగా ట్యాంక్ లీకు అవుతోందని స్థానికులు అంటున్నారు. లీకుల వల్ల తాగునీరు వృథా అవుతోందని, ట్యాంకు పరిసరాలు మురుగుతో నిండిపోతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని, నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్‌లో ఈ లీకులు పెద్దవై ట్యాంకు కూలిపోయే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

సిగ్నల్ పాయింట్‌కు మరమ్మతులు



సిగ్నల్ పాయింట్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురంటౌన్: ఈనెల 5న సాక్షిలో ప్రచురితమైన 'రక్షక భటులకే.. రక్షణ కరువు' కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని వారం రోజుల కిందట గుర్తుతెలియని వాహనం ఢీకొని ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ మరమ్మతులకు గురైంది. దీన్ని సాక్షి పత్రిక సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించి సిగ్నల్ పాయింట్‌కు మరమ్మతులు చేయించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ




ఎరువుల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ

సాలూరు: పట్టణంలో పురుగుల మందులు, ఎరువుల దుకాణాలను ఏఓ అనురాధ పండా మంగళవారం తనిఖీ చేశారు. గోదాంలో ఉన్న స్టాక్, వాటి రికార్డులను తనిఖీ చేశారు. అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే సదరు డీలర్లపై కేసులు నమోదు చేయడంతో పాటు వారి లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ పాఠశాలలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయురాలిని పలువురు తోటి ఉపాధ్యాయులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నీరు ఉన్నా.. అందని పరిస్థితి



తోటపల్లి కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు



బలిజిపేట: సాగునీరు అందకపోవడంతో వరినాట్లు వేయకుండా విడిచిపెట్టిన పొలం

సీతానగరం: మండలంలోని బుడ్డిపేట-లక్ష్మీపురం గ్రామాల మధ్య సువర్ణముఖీ నదిపై అప్పట్లో నిర్మించిన ఎక్విడెక్ట్ ద్వారా తోటపల్లి కుడికాలువలోకి వరదనీరు పోటెత్తుతోంది. కాలువల్లో నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నా గాదెలవలస, పీబీపేట, దయానిధిపురం గ్రామాలకు మాత్రం సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామాల మధ్య తోటపల్లి సాగునీరు అందించేందుకు నిర్మించిన కాలువలు, కల్వర్టు పనులు అర్ధాంతంగా నిలిచిపోవడంతో సాగునీరు అందక నష్టపోతున్నామని రైతులు అంటున్నారు. తోటపల్లి కాలువల ద్వారా నీరు వస్తున్నా.. తమ గ్రామాలకు నీరు రావడం లేదని వాపోతున్నారు.

సాగునీరు అందక ఉబాలు ఆలస్యం

బలిజిపేట: మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఖరీఫ్ వరినాట్లు ఆలస్యమవుతున్నాయి. మండలంలో ఈ ఏడాది సుమారు 16,672 ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ సిబ్బంది అంచనా వేశారు. అయితే 13,500 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల నాట్లు వేసుకోగా.. వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో నాట్లు పూర్తికాలేదు. వరినారు ముదిరిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ సమయానికి నాట్లు పూర్తయి, రెండో విడత ఎరువులు వేసుకునేవాళ్లమని, ఈ ఏడాది ఇప్పటివరకు నీరు లేక నాట్లు వేయలేకపోయామని అంపావల్లి, పెదపెంకి, చిలకలపల్లి తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు. పెదంకలాం కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో ఈ ఏడాది సుమారు 3 వేల ఎకరాల్లో వరిసాగు కష్టమే అని రైతులు అంటున్నారు.

సచివాలయం నుంచి సామగ్రి తరలింపు



పి.చాకరాపల్లి సచివాలయం నుంచి కంప్యూటర్ పరికరాలను తీసుకువెళ్తున్న పదమాయవలస గ్రామస్తుడు

బలిజిపేట: పి.చాకరాపల్లి సచివాలయం నుంచి పరికరాలను నేనే తీసుకువెళ్లానని పదమాయవలస సర్పంచ్ సత్యనారాయణ తెలిపారు. అధికారులకు చెప్పి వాటిని తీసుకువెళ్లినట్లు చెప్పారు. పదమాయవలస సచివాలయం ద్వారా గ్రామానికి చెందిన పనులు చేయించుకునేందుకు ఈవిధంగా చేసినట్లు చెప్పారు. గతంలో పంచాయతీకి తానే కుర్చీలు అందించానని అన్నారు. ప్రింటర్‌ను పంచాయతీ డబ్బులతో కొనుగోలు చేశానని, సచివాలయానికి అని ప్రత్యేకించి రాలేదన్నారు. అందువలననే మాకు సంబంధించిన వాటితో పాటు కంప్యూటర్, సీపీయూ తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామం నుంచి వృద్ధులు, మహిళలు సువర్ణముఖీ నదిని దాటి అవతలకు వెళ్లి పనులు చేయించుకోలేకపోతున్నారని, అందుకే వాటిని తీసుకువచ్చామన్నారు. ఒక పంచాయతీ సర్పంచ్ అయి ఉండి ప్రభుత్వంకు చెందిన ఆస్తి, సచివాలయంలో ఉండగా సచివాలయ కార్యదర్శికి చెప్పకుండా ఏవిధంగా తీసుకొచ్చారనేది చర్చనీయాంశం. అధికార పార్టీకి చెందిన నేతననే ధోరణితో రాజకీయ జులుం ప్రదర్శించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకుడు కాకుండా ఒక సామాన్యుడు ఈ విధంగా చేస్తే అధికారులు ఏమిచేసి ఉండేవారని, మరి ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదనేది పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంపీడీఓ రమేష్‌నాయుడును వివరణ కోరగా.. పదమాయవలస పంచాయతీలో పరికరాలు ఉన్నాయి. వాటిని త్వరలోనే సచివాలయానికి అప్పగించడం జరుగుతుందన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు అందించాలి

- డీఐఓ డాక్టర్ ఎం.నారాయణ



మందుల నిల్వలను పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ ఎం.నారాయణ

సీతానగరం: చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ ఎం.నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం సందర్శించారు. మందుల నిల్వలు, రికార్డులు, అందుబాటులో ఉన్న టీకాలు, ఫార్మసీ రూం, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందించాలన్నారు. నిర్దేశిత గడువులోగా చిన్నారులకు టీకాలు వేయాలన్నారు. పీహెచ్‌సీలో పాముకాటు, కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు తెలియజేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో డాక్టర్ పి.పావని అధ్యక్షతన ఆశావర్కర్లకు తల్లిపాల విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇందివ్వడం వల్ల బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, హెల్త్ సూపర్‌వైజర్లు శర్మ, భవాని, సత్యవతి పాల్గొన్నారు.

తల్లిపాలే శిశువుకు శ్రీరామరక్ష



మక్కువ: మక్కువలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని, దీని వల్ల బిడ్డలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు తల్లిపాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని మక్కువ, మార్కొండపుట్టి గ్రామాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. సూపర్‌వైజర్లు పి.రాజశ్రీ, ఎస్.లీలావతి పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవం

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ తల్లిపాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ గిరిమిత్ర సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నిషేధ చట్టం, పని చేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా నిరోధక చట్టం, గృహహింస నుంచి మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

8న ఉచిత మెగా వైద్యశిబిరం

పార్వతీపురంటౌన్: మండలంలోని డోకిశీల గ్రామంలో ఈ నెల 8న ఉచిత మెగా వైద్యశిబిరం, క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ పారామెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు నాగిరెడ్డి సింహాచలం మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా రాగోలు వద్ద ఉన్న జెమ్స్ ఆస్పత్రి సహకారంతో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో అన్ని రకాల వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలందిస్తారని అన్నారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ వైద్య శిబిరాన్ని ఈ ప్రాంతం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారున. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నడిమింటి గోపాలనాయుడు, ఉపాధ్యక్షులు వానపల్లి శంకరరావు, జాయింట్ సెక్రటరీ బీవీ రమణ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయండి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు

మక్కువ: ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సాలూరు సబ్ డివిజన్ గృహనిర్మాణ శాఖ డీఈ జీ సోమేశ్వరరావు అన్నారు. స్థానిక జగనన్న లేఅవుట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేఅవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపామన్నారు. మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని లబ్ధిదారులకు సూచించారు. ఆయన వెంట గృహనిర్మాణశాఖ ఏఈ ఏ సింహాచలం, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

అడుగంటిన చెరువు



మామిడిపల్లి వద్ద నీరు లేక ఎండిపోతున్న చెరువు

సాలూరు రూరల్: మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్నప్పటికీ చెరువుల్లో చుక్కనీరు చేరలేదు. గతంలో జూలై నెలాఖరు నాటికి చెరువుల్లో పూర్తిస్థాయి నీరు చేరి కళకళలాడేవి. అయితే ఈ ఏడాది చెరువుల్లో నీరు లేకపోవడంతో తొలివిడతలో మొక్కజొన్న వేసిన రైతులు మొలకలు రాక నష్టపోయారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువుల్లో నీరు చేరకపోవడంతో వరి చేను చివరి దశలో పంటకు నీటి తడులు ఎలా అందించాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారపు సంత వెలవెల

- ఒడిశా సంతకు వెళ్లిపోతున్న పరిసర ప్రాంత గిరిజనులు
- వ్యాపారాలు లేక ఉసూరుమంటున్న చిరువ్యాపారులు



వెలవెలబోతున్న నేరెల్లవలస వారపు సంత

సాలూరు రూరల్: మండలం నేరెల్లవలస వారపు సంత వెలవెలబోతోంది. గతంలో గిరిజన గ్రామాల నుంచి వచ్చే కొనుగోలుదారులతో కళకళలాడుతూ కనిపించే ఈ సంతకు గత కొంత కాలంగా ఆదరణ తగ్గుతోంది. ప్రతీ మంగళవారం జరిగే ఈ వారపు సంతలో గిరిజనులు పండించిన వివిధ పంటలు విక్రయిస్తుంటారు. అలాగే వారికి అవసరమైన నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి గ్రామాలకు చేరుకునేవారు. అయితే నేరెల్లవలస సంత ప్రాంతానికి వచ్చిన గిరిజనులు ఆంధ్రా-ఒడిశా వివాదాస్పద కొఠియా గ్రూపు గ్రామాల నుంచి నిత్యం వచ్చి వెళ్లేవారు. ఇటీవల కాలంలో ఒడిశా ప్రభుత్వం కుందిలి సంతకు వెళ్లేందుకు బీటీ రోడ్డు వేయడంతో గిరిజనులు ఒడిశాలోని సంతకు వెళ్లిపోతున్నారు. దీంతో సంతకు వచ్చే వ్యాపారులు కూడా తగ్గిపోయారు. దశాబ్దాలుగా అలవాటుపడిన వ్యాపారులు ఎంతోకొంత వ్యాపారం జరుగుతుందనే ఆశతో ప్రతీ మంగళవారం వస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నా పైసా వ్యాపారం జరగకపోవడంతో ఉసూరు మంటూ ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే అనతికాలంలోనే ఈ వారపు సంత కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని స్థానికులు అంటున్నారు.

అలవాటుగా వచ్చేస్తున్నాం

వ్యాపారం జరిగినా, జగకపోయిన ప్రతీ మంగళవారం ఈ వారపు సంతకు అలవాటు ప్రకారం సరుకులు అమ్ముకునేందుకు వస్తున్నాం. గతంలో రూ.3 వేలు వరకు వ్యాపారం జరిగేది. ఇప్పుడు రూ.500లు వ్యాపారం కూడా జరగడం లేదు. నెల మొదటి వారంలో అయితే జీసీసీ డిపో సరుకులు తీసుకునేందుకు వచ్చిన గిరిజనులు ఎంతో కొంత సరుకులు కొంటారని ఆశతో వస్తున్నాం.

– శంకరరావు, చిరువ్యాపారి

హామీలు అమలు చేసేంతవరకు పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. స్థానిక బెలగాం గిరిజన భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు సీపీఐ ప్రశ్నిస్తునే ఉంటుందన్నారు. కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలందరికీ తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, ఆ స్థానాన్ని సీపీఐ తీసుకొని ప్రతిపక్ష పాత్ర పోసిస్తుందన్నారు. సూపర్ సిక్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేసేందుకు ఎటువంటి ప్రయత్నం చేయడం లేదన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్న మాట్లాడుతూ.. ఏనుగుల సమస్యపై, రోడ్ల సమస్యపై, గుమ్మలక్ష్మీపురం మండలంలో ఇళ్ల స్థలాలపైన సీపీఐ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని, వాటిపై పోరాటం సాగిస్తోందన్నారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొచ్చ మోహనరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ జనార్దన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవీ నాయుడు, జిల్లా సమితి సభ్యులు సాలాపు అనంతరావు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఉపాధ్యక్షుడు సింహాద్రి కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగు భూమికి పట్టాలివ్వాలి



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీఐటీయూ నాయకులు బంకురు సూరిబాబు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు 23వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ పట్టణ కమిటీ సభ్యులు మంగళవారం దీక్షలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ.. శివ్వాం గ్రామంలో దళితులను కులం పేరుతో తిట్టి, కొట్టిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని, వారి భూములను వెంటనే వాళ్లకు అప్పగించాలని డిమాండ్ చేశారు. తొక్కుడువలస, తానవలస, పనసభద్ర, దోనిగెడ్డవలస, సంధివలస, సీతంపేట, ములగవలస, లచ్చందొరవలస, వెలగవలస, గ్రామాలలో గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని, గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు పెట్టిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.ఉమామహేశ్వరరావు, కె.ఉపేంద్ర, పి.రాజశేఖర్, ఎం.వెంకటరమణ, హెచ్.సంహాచలం, అఖిల్ పాల్గొన్నారు.

చెప్పినట్లు వినకపోతే విధుల నుంచి తొలగిస్తా..

- వీఓఏలపై ఏపీఎం ఆగ్రహం



మాట్లాడుతున్న ఏపీఎం పువ్వల సురేష్‌కుమార్

పార్వతీపురంటౌన్: పంచాయతీ స్థాయిలో నాయకులు మిమ్మలను విధుల నుంచి తొలగించి కొత్తవారికి అవకాశం ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని, సక్రమంగా విధులు నిర్వహించకపోతే విధుల నుంచి తొలగించాల్సి వస్తుందని వీఓఏ, సీసీలను ఐకేపీ ఏపీఎం పువ్వల సురేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఓఏ, సీసీలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో మహిళా సంఘాల నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా తప్పు చేస్తే విధుల నుంచి తొలగించాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే మండలంలోని అనేక పంచాయతీల్లో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో నాయకుల సూచన మేరకు వీఓఏలను తొలగించాల్సి వస్తుందని ఏపీఎం హెచ్చరించారు. ఆయన మాటలు వివాదాస్పదంగా మారాయి. ఏపీఎం మాటలు వింటుంటే నాయకులకు కొమ్ముకాస్తున్నారా? లేక విధులు నిర్వహిస్తున్న వీఓఏలను పరోక్షంగా హెచ్చరిస్తున్నారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. వాస్తవానికి మండల పరిధిలో ఐదు క్లస్టర్లలో సుమారు 36మంది వీఓఏలు ఉన్నారు. వీరందరూ ఆయా పొదుపు సంఘాలను చైతన్య పరుస్తూ, ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందేలా చూస్తూ, బ్యాంకు రుణాలు మంజూరులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. సమావేశాల్లో అధికారులు మహిళలు అని కూడా చూడకుండా వారిపై చిందులేస్తూ హెచ్చరికలు జారీ చేయడం విచారకరం. వ్యవస్థలో చిన్న చిన్న లోటుపాటుల సహజమైనప్పటికీ ఏపీఎం తీరు మాత్రం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించిన అవసరం ఎంతైనా ఉంది.

కనీస వేతనం అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం డిపోలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు, పార్వతీపురం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కి యూనియన్ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ డిపోలో గత 13 సంవత్సరాలుగా సుమారు 25 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, వారిలో స్కిల్డ్ కార్మికులకు రూ.15700, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.10,200 నెలకు లేబర్ డిపార్ట్‌మెంట్, ప్రభుత్వం ప్రకటించిన జీతం కాంట్రాక్టర్ చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, అన్ని సౌకర్యాలు అమలు కోసం ప్రతీ కార్మికుడికి ఆర్టీసీ డిపార్ట్ కాంట్రాక్టర్‌కి సుమారు రూ.20,000లకు పైగా చెల్లిస్తోందన్నారు. కార్మికులకు ప్రిన్సిపుల్ యజమాని ఆర్టీసీ డిపార్ట్‌మెంట్‌పై కనీస వేతనం అమలు చేయాలి, కానీ కాంట్రాక్టర్ స్కిల్డ్ కార్మికులకు రూ.14000, అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.10,000 చెల్లిస్తున్నారని, ఇదేంటని అడిగితే నచ్చితే చేయండి, లేకపోతే పోండని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, కార్మికులకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ యూనియన్, సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.భాస్కరరావు, బి.త్రినాథరావు, కృష్ణకాంత్, రాంబాబు, కుమారస్వామి, వి.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటరావు, గంగాధర్ పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ



కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పీఓ ఎస్.సేతుమాధవన్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి ఎస్.సేతు మాధవన్ పర్యవేక్షణలో అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఏర్పడిన ఖాళీల్లో ఉపాధ్యాయులు ఎంచుకున్న ఐచ్ఛికాల ప్రకారం బదిలీలు చేపట్టారు. మొత్తం 76 మంది ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. బదిలీ అయిన స్థానాలలో వెంటనే చేరాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పారదర్శకంగా బదిలీ ప్రక్రియ చేపట్టామని, ఉపాధ్యాయులు కోరిన చోటకు వారిని పంపించడం జరిగిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పీఓ సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు రుక్మాంగధయ్య, ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ సుగుణ, పీఎంఆర్‌సీ ఏఎంఓ రాయుడు, సహాయ ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

